

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రజిత

## రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి

చందుర్తి, మే 15 : రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారిని రజిత సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కాయాకల్ప అసెస్మెంట్ జిల్లా టీంతో గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాణ్యతతో కూడిన సదుపాయాలు వైద్య సహాయం పొందే వ్యాధిగ్రస్తులకు అందుబాటులో ఉంచాలని ఉద్దేశంతో ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసినట్లు తెలిపారు. దవాఖాన పరిసరాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ టీం ఎన్‌హెచ్‌ఎం డీపీవో రాజేందర్, క్వాలిటీ మేనేజర్ సింధూజ, వైద్యాధికారులు సురేశ్, డాక్టర్ దివ్యశ్రీ పాల్గొన్నారు.

# సిరిసిల్లలో కేటీఆర్ పర్యటన..

- అంకిరెడ్డిపల్లెలో బీరప్ప వేడుకలకు హాజరు
- పెద్దూరులో నూతన దంపతులకు ఆశీర్వాదం



బీరప్ప–కామరతి కల్యాణ వేడుకలకు హాజరై మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సిరిసిల్ల టౌన్, మే 15 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు గురువారం సిరిసిల్లలో పర్యటించారు. తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లెలో కుర్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బీరప్ప–కామరతి కల్యాణ మహోత్సవ వేడుకలకు హాజరయ్యారు. ముందుగా కుర్మ సంఘం ఆధ్వర్యంలో నాయకులు కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలో ఆయన పాల్గొన్నారు. అక్కడి నుంచి సిరిసిల్ల క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని పెద్దూరులో బీఆర్ఎస్ నాయకుడు ముష్కం దేవాగౌడ్ కూతురు వివాహం ఇటీవల జరుగగా వారి నివాసానికి వెళ్లి దంపతులను ఆశీర్వదించారు. ఆ తర్వాత ఎల్లారెడ్డిపేట పర్యటనకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నాఫ్ స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, తంగళ్లపల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, బొల్లి రామ్మోహన్, సింగిరెడ్డి రవీందర్‌రెడ్డి, పడిగెల రాజు, మాట్ల మధు, కేటీఆర్ సేన మండలాధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, కల్లూరి రాజు, అన్నారం శ్రీనివాస్, బండారి శ్యాం, కేమల్లారెడ్డి, సత్తార్, తదితర నాయకులు ఉన్నారు.

# అదే విచారణ.. అదే అలసత్వం

- ఉపాధి పనుల్లో అవకతవకలు
- కలెక్టర్ ఆదేశించిన మారని తీరు
- తూతూమంత్రంగా నాయకుల మధ్య వివరాల సేకరణ



నాయకులతో విచారణ చేస్తున్న అధికారులు



ఆన్‌లైన్‌లో కూలీల ఫొటోలకు బదులు మొక్కల ఫొటోలు

వీర్నపల్లి, మే 15 : కేంద్ర ప్రభుత్వం పేద కూలీలకు పని కల్పించాలనే ఉద్దేశ్యంతో చేపట్టిన మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మండల స్థాయి అధికారుల అక్రమాలతో పక్కదారి పడుతుంది. ఉపాధి హామీ బిల్లుల చెల్లింపుపై ఏటా అడిట్ బృందాలతో సామాజిక తనిఖీలు చేపడుతున్న మస్టర్‌లో తప్పులు, కొలతల విషయాలపై స్థాయి అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారు. ప్రజా వేదికలు నిర్వహిస్తూ విచారణ చేపడుతున్న సిబ్బంది తీరు మారడం లేదు. అధికారుల అలసత్వంతో విచారణ తూతుమంత్రంగా జరుగుతుంది. వీర్నపల్లి మండలం బంజేరు, సీతారాంనాయక్‌తండాలో ఉపాధి హామీ బిల్లుల చెల్లింపులో అవకతవకలు జరిగాయంటూ కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు సోషల్ మీడియా ద్వారా పలువురు ఫిర్యాదు చేయగా, అధికారులను విచారణకు అదేశించారు. కలెక్టర్ అదేశాలతో గ్రామానికి చేరుకున్న ఈజీఎస్ ఏపీడీ నర్సింలు పంచాయతీ కార్యాలయాల్లో గురువారం విచారణ చేపట్టారు. కూలీలతో సమావేశం ఏర్పాటు చేసి వివరాలు సేకరించాల్సి ఉండగా, వివిధ పార్టీల నాయకుల మధ్య విచారణ చేశారు.

**కూలీల ఫొటోల స్థానంలో మొక్కల ఫొటోలు..**

పని చేసే ప్రదేశంలో కూలీల ఫొటోలను అన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉండగా అధికారుల నిర్లక్ష్యంతో మొక్కల ఫొటోలను అన్‌లైన్ నమోదు చేశారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పలు పార్టీలకు చెందిన నాయకుల అండదండలతో విచారణ చేయలేదని కూలీలు ఆరోపించారు. మొక్కల ఫొటోలు అప్‌లోడ్ చేసిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల గ్రామాల్లో సామాజిక చేపట్టిన అడిట్ బృందాలను ఓ మండల స్థాయి అధికారి తప్పుదోవ పట్టించారని అగ్రహం వ్యక్తం చేశారు. సొంత మండలానికి చెందిన వారే టెక్నికల్ అసిస్టెంట్లుగా పనిచేస్తుండడంతో అక్రమాలకు అడ్డులేకుండా పోతోవదని మండిపడ్డారు. కలెక్టర్ విచారణకు అదేశించిన కూలీల అందరికీ సమాచారం ఇవ్వలేదని అసహనం వ్యక్తం చేశారు. అధికారులను తప్పుదోవ పట్టించేందుకు తమకు అనుకూలంగా ఉండే కూలీలను సమావేశానికి తీసుకెళ్లారని పేర్కొన్నారు.

**నివేదికను కలెక్టర్‌కు అందిస్తాం..**

బంజేరు, సీతారాంనాయక్‌తండాలో ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగాయంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. కలెక్టర్ అదేశాలతో గ్రామాల్లో విచారణ చేశాం. కూలీల నుంచి వివరాలు సేకరించినం. సంబంధిత రికార్డులను పరిశీలించి, విచారణ నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తాం.

**- ఏపీడీ, నర్సింహులు**

## నాణ్యమైన సేవలు అందించాలి

హుజూరాబాద్ టౌన్, మే 15: వంట గ్యాస్ వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలని అంబుజా గ్యాస్ ఏజెన్సీస్ మేనేజింగ్ పార్ట్‌నర్, తెలంగాణ గ్యాస్ డీలర్ల సంఘం అధికార ప్రతినిధి పీవీ మదన్‌మోహన్ పేర్కొన్నారు. పట్టణంలోని అంబుజా గ్యాస్ ఏజెన్సీ స్ ప్రాంగణంలో సంస్థ 36వ వార్షికోత్సవ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కేక్ కట్ చేసి, సిబ్బందిని సత్కరించారు. 1989 మే 15న అతి తక్కువమంది కస్టమర్లతో ప్రారంభమైన సంస్థ.. మూడు పుష్కరాల కాలంలో సుమారు 26వేల మంది కస్టమర్లకు సేవలం దించే స్థాయికి చేరిందన్నారు. ఇక్కడ సంస్థ మేనేజర్ దేవేందర్‌రెడ్డి, సీనియర్ కస్టమర్లు గోపాల్‌రెడ్డి, కరాటే రమేశ్, సుధాకర్‌రెడ్డి, ఉద్యోగులు పవన్, శరత్, భరత్, భరత్‌రెడ్డి, సరిత సీనియర్ డెలివరీ సిబ్బంది కనకయ్య, భాస్కర్, సురేశ్, ప్రభు, తదితరులు ఉన్నారు.

## పారదర్శకంగా యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్

రాజన్న సిరిసిల్ల, మే 15 (నమస్తే తెలంగాణ) : రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. ఈ నెల 20లోపు లబ్ధిదారుల వివరాలను సమర్పించాలని ఎంపీడీవోలకు సూచించారు. గురువారం కలెక్టర్‌లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో యువ వికాసం పథకంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజీవ్ యువ వికాసం పథకం కింద జిల్లా వ్యాప్తంగా 36,819 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. వచ్చిన దరఖాస్తులను ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో పరిశీలించి, ఆయా బ్యాంకులకు పార్వర్డ్ చేయడం జరిగిందన్నారు. 6,192 దరకాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. బ్యాంకులకు పంపిన దరఖాస్తులను గ్రౌండ్ స్క్రూటిని పూర్తి చేశామన్నారు. యూనిట్ల మంజూరు చేస్తామంటూ లబ్ధిదారుల వద్ద కొంత మంది డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎవరూ కూడా డబ్బులు ఇవ్వొద్దని సూచించారు. దళారీల ఒత్తిడి లేకుండా పేదలకు మాత్రమే ఈ పథకాలు అందాలని, ఎక్కడైనా అనర్హులకు చేరినట్లయితే అందుకు సంబంధించిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలను మోసగిస్తున్న దళారీలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీవో శేషాద్రి, ఎల్‌డీఎం మల్లికార్జున్, మైనార్టీ వెల్ఫేర్ అధికారి భారతి, బీసీ వెల్ఫేర్ అధికారి రాజమనోహర్, ఈడీఎస్సీ కార్పొరేషన్ అధికారి స్వప్న, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

శంకరపట్నం/వీణవంక, మే 14: ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గాలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ పిలుపునిచ్చారు. బుధవారం శంకరపట్నం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో, వీణవంక మండల కేంద్రంలో సార్వత్రిక సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని దుయ్యబట్టారు. 20న వీణవంక మండల కేంద్రంలో బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించనున్న నిరసన ర్యాలీలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తీవ్రంగా ప్రతిఘటించాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ, ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

వేములవాడ రూరల్, మే 15: మండలంలోని వట్టెంల గ్రామంలోని రైతువేదికలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసా యశాఖ సంయుక్తంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు .ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఏడిఏ రామరావు మాట్లాడుతూ జూన్ 13 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా రైతు వేదికలో సాగునీటి ఆదా చేయడంపై వరిలో తడిపోడి విధానంతో నాటి యాజమాన్యం చేసినట్లయితే 15 నుంచి 30శాతం నీటిని ఆదా చేయవచ్చన్నారు. మక్కజొన్నలో జంట సాళ్ల పద్ధతిలో డ్రిప్‌తో సాగుచేయాలని, బిందు, తుంపర్ల సేద్యంతో మొక్కలకు నీటి అందిస్తే నీటి వినియోగ సామర్థ్యం 85 నుంచి 90 శాతం పెంచవచ్చన్నారు. పంట మార్పిడి చేసి విభిన్న మార్కెట్ అవకశాలు పొందడం, ఆహారభద్రత పెంపొందించడం, తెగుళ్ల తీవ్రత తగ్గించడం తదితర అంశాలపై బాబూ జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల బృందం డాక్టర్ రజియా సుల్తానా, ఏవో వినీత, టిజీ సిడ్ అధికారి మౌనిక, ఏఈవోలు మసూద్, ప్రేమ్సాయి, వెంకటరమణ పాల్గొన్నారు.

## మంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

రుద్రంగి, మే 15: మండల కేంద్రంలో రెవెన్యూ, హౌసింగ్, ఐ అండ్ పీఆర్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశించారు. మంత్రుల పర్యటన నేపథ్యంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేశ్ బీ గితేతో కలిసి చేయాల్సిన ఏర్పాట్లపై గురువారం మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల భూ సమస్యల పరిష్కారమూ ధ్యేయంగా భూ భారతి పోర్టల్ తీసుకువచ్చి ముందుగా పైలెట్ ప్రాజెక్టు కింద నాలుగు మండలాల్లో అమలు చేశామన్నారు. ప్రస్తుతం ప్రతి జిల్లాలో ఒక మండలంలో భాగంగా రుద్రంగి మండలంలో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాధాబాయ్, ఆర్ అండ్ బీ ఈఈ వెంకట రమణయ్య, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ శంకర్, వైద్య ఆరోగ్య శాఖ అధికారి రజిత, ఏఎంసీ చెర్మన్ చెలుకల తిరుపతి, తహసీల్దార్ శ్రీలత, పైలెట్ ప్రాజెక్టు ఇన్‌చార్జిలు భూపతి, ఎంపీడీవో నటరాజ్ పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంతో 'దళితబంధు' జాప్యం

వీణవంక, మే 15: ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన ప్పటికీ.. ఎంపీడీవో నిర్లక్ష్యంతో దళితబంధు పథకం అమలులో జాప్యం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ జాయింట్ ఆక్షన్ కమిటీ, దళితబంధు సాధన సమితి జేఏసీ కన్వీనర్ ఇంజం వెంకటస్వామి పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం ఎమ్మార్పీఎస్, దళిత బంధు సాధన సమితి ఆధ్వర్యంలో దళితబంధు నిధుల విడుదలకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీడీవో శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. దళితబంధు సాధన సమితి, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 20నుంచి పెద్ద ఎత్తున ఎంపీడీవో కార్యాలయా ల ముట్టడి ఉంటుందని వెంకటస్వామి తెలిపారు. మండల లబ్ధిదా రులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా మండలాల కో కన్వీనర్లు ఆకెనపెల్లి ప్రవీణ్, రామంచ రాకేశ్, మహంకాళి రమేశ్, దాసారపు నాగరాజు, బోయిని సమ్మయ్య, గంగారపు ప్రవీణ్, బండారి ప్రశాంత్, గాజుల కుమార్, అంబాల శంతన్, సరిగొమ్ముల విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో ఒకరి బలవన్మరణం

కరీంనగర్ రూరల్: మే 15: మద్యం మత్తులో కుటుంబ సభ్యులతో గొడవ పడి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లి గ్రామానికి చెందిన చట్టు కనుకరాజు(50) జీవనోపాధి కోసం కొన్నేండ్లపాటు గల్ఫ్ వెళ్తువచ్చేవాడు. ఈ క్రమంలో ఆరు నెలల క్రితం చివరిసారిగా గల్ఫ్ నుంచి వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. కొంత కాలంగా కనుకరాజు మద్యానికి బానిసయ్యాడు. రోజు తాగొచ్చి భార్యాపిల్లలతో గొడవపడేవాడు. బుధవారం సాయంత్రం ఆరు గంటలకు కూడా గొడవ పెట్టుకున్నాడు. రాత్రి ఎనిమిది గంటలకు మళ్లీ తాగొచ్చి గొడవపడి వెళ్లిపోతుండగా భార్య, కొడుకు ఆపి ఇంట్లో ఉంచాడు. తాగిన మైకంలో కనుకరాజు చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కనుకరాజు భార్య భారతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు.

## సీపీఐ మహాసభను విజయవంతం చేయండి

శంకరపట్నం, మే 15: మండల కేంద్రంలో ఈ నెల 16న నిర్వహిస్తున్న సీపీఐ 5వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యుడు బోయిని అశోక్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. మహాసభలకు నాయకులు, మహిళలు, రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బొజ్జ సదానందం, గోదరి లక్ష్మణ్ పాల్గొన్నారు.

## భారీ వృక్షం కూలింది

- కామారెడ్డి, సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఘటన
- భారీగా నిలిచిన వాహనాలు
- వృక్షాన్ని తొలగించిన ఆర్ అండ్ బీ అధికారులు

ఎల్లారెడ్డిపేట మే 15: మండలంలోని గొల్లపల్లి శివారులో ప్రధాన రహదారిపై పక్కన ఉన్న భారీ వృక్షం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా బుధవారం మంటలు అంటుకోవడంతో ఫైర్ సిబ్బంది మంటలను చల్లార్చారు. అదే వృక్షం గురువారం కామారెడ్డి కరీంనగర్ ప్రధాన రహదారిపై అడ్డంగా కూలిపోయింది. దీంతో వచ్చి పోయే వాహనాలు నిలిచి భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆర్ అండ్ బీ అధికారులతో కలిసి వృక్షాన్ని ఎక్స్‌కావేటర్, ట్రాక్టర్ సాయంతో తొలగించారు.



గొల్లపల్లిలో వృక్షాన్ని తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

# ఉచిత క్రికెట్ శిక్షణ..

- ఆసక్తి చూపుతున్న చిన్నారులు
- నెల రోజుల పాటు కొనసాగనున్న శిక్షణ
- ప్రతిభ చూపిన వారికి హెచ్‌సీఏకీ ఎంపిక

వేములవాడ, మే 15 : ప్రస్తుత చిన్నారులు క్రికెట్ అంటే అంతా ఇంతా క్రేజ్ కాదు. వేసవికాలం కావడంతో ఆపైగా ఉచితంగా శిక్షణ వేములవాడలో ఇస్తున్నందున్న చిన్నారులు ఆసక్తి చూపుతున్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ క్రికెట్ అసోసియేషన్ వేములవాడలో వారం రోజులుగా ఉచిత శిక్షణ అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు చిన్న పట్టణాల నుంచి కూడా ఆసక్తి ఉన్న క్రికెట్ క్రీడాకారులను వెలికి తీసేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఈ ఉచిత శిక్షణ అందిస్తోందని నిర్వాహకులు తెలిపారు. 13 ఏండ్ల నుంచి 23 ఏండ్లలోపు వారికి నెల రోజుల పాటు ఉచిత శిక్షణ అందిస్తున్నారు. శిక్షణకు జిల్లాలోని అన్ని మండలాల్లో నుంచి దాదాపు 150 మంది బాల, బాలికలు హాజరై శిక్షణ పొందుతున్నారు.

**మెలుకువలను అందిస్తున్న నిర్వాహకులు..**

క్రికెట్‌పై ఆసక్తి ఉన్న చిన్నారులకు అందులోని మెలుకువలతో కూడిన శిక్షణను అందిస్తున్నారు. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు ప్రతిరోజూ మూడు గంటల పాటు శిక్షణ అందిస్తున్నారు. క్రమశిక్షణ, వ్యాయామం, ప్రతిరోజు మూడు బ్యాచుల వారీగా శిక్షణను అందిస్తున్నారు. అయితే ఇందులో ప్రతిభ చూపిన చిన్నారులను అంతర్ జిల్లా స్థాయి క్రికెట్ టీంకు ఎంపిక చేసి వారి ప్రతిభ ఆధారంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కూడా ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ నెల 17 నుంచి నియోజకవర్గస్థాయి జట్లను కూడా ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. ఇక వేములవాడలో సీనియర్ క్రీడాకారులు శ్రీకాంత్, టిల్లు, నిఖిల్, నవీన్ పటేల్, ప్రసాద్ పర్యవేక్షణలో ఈ శిక్షణ అందిస్తున్నారు.



వేములవాడలో ఉచిత క్రికెట్ శిక్షణ కోసం వచ్చిన చిన్నారులు

**హైదరాబాద్ స్థాయిలో ఇక్కడే శిక్షణ అందుతోంది**



హైదరాబాదులో మాత్రమే అందించే క్రికెట్ శిక్షణ ఇప్పుడు వేములవాడలో అందుతుంది. మంచి శిక్షణను అందుకొని తప్పకుండా రంజిట్రోపి వరకు వెళ్లాలని అనుకుంటున్నాను. వేసవితో పాటు సమయం దొరికితే ఇతర సెలవు రోజుల్లో కూడా శిక్షణ ఇస్తే బాగుంటుంది.

**-మహేశ్, చీర్లవంచ వేములవాడ మండలం**

**మహిళా క్రికెట్ జట్టు తరపున ఆడాలని ఉంది**



వేములవాడలో ఉచితంగా శిక్షణ ఇస్తుండడంతో నేర్చుకునేందుకు అవకాశం వచ్చింది. కరీంనగర్ క్రికెట్ అసోసియేషన్ ప్రత్యేక కృతజ్ఞతలు. ఉచిత శిక్షణ ద్వారా మంచి మెలకువలు నేర్చుకొని మహిళా క్రికెట్ జట్టు తరపున ఆడాలని ఉంది.

**- ఆకాంక్ష, వేములవాడ**

**ప్రతి రోజూ శిక్షణ ఇస్తున్నాం..**



వేములవాడలో నిర్వహిస్తున్న ఉచిత క్రికెట్ శిక్షణకు మంచి స్పందన ఉంది. జిల్లా మొత్తం నుంచి 150 మంది వరకు వచ్చి శిక్షణ పొందుతున్నారు. వయ స్సు ఆధారంగా జిల్లా స్థాయి పోటీలకు ఎంపికవుతారు. ప్రతిభ చూపిన వారు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కూడా ఎంపికవుతారు. చిన్నారులు ఆసక్తిగా నేర్చుకుంటున్నారు.

**- పెద్దిరాజు , కోచ్ వేములవాడ**



కేక్‌కట్ చేస్తున్న జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి

### మాజీ ఎమ్మెల్యే రసమయి పుట్టిన రోజు వేడుకలు

ఇల్లంతకుంట, మే 15 : మండలకేంద్రంలో మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ పుట్టిన రోజు వేడుకలు బీఆర్ఎస్ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో కేక్‌కట్ చేసి, పంపిణీ చేశారు. ఆయన మానకొండూర్ నియోజకవర్గానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసి ఒగ్గు నర్సయ్య, నాయకులు కేవీఎన్ రెడ్డి, రాజిరెడ్డి ఉడుతల వెంకన్న, సాదుల్, అనిల్, రఘు, శ్రీనివాస్, మధు, అనిల్, ప్రశాంత్ రెడ్డి, వెంకటేశం, కిషన్ రెడ్డి, భాగయ్య, భాబు, బాబు సింగ్, బాలకిషన్, సుధాకర్ రెడ్డి, శంకర్, ప్రభాకర్, పరశురాం ఉన్నారు.

### కళాకారులకు పింఛన్ ఇవ్వాలి



సమావేశమైన కళాకారులు

కోనరావుపేట, మే 15: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కళాకారులు మామిడిపల్లి సీతారామస్వామి ఆలయ ఆవరణలో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 40 ఏళ్లుగా గ్రామాల్లో వీధి నాటకాలను ప్రదర్శిస్తున్నామన్నారు. అంతరించిపోతున్న కళలను కాపాడుతున్న తమను ప్రభుత్వం కళాకారులుగా గుర్తించాలని, పింఛన్ ఇవ్వాలని డిమాండ్ కోరారు.

### ముందుస్తుగా క్షయ నిర్ధారణ పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

బోయినపల్లిరూరల్, మే15: ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ముందస్తు క్షయ నిర్ధారణ పరీక్షలను వైద్యుడు కార్తీక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పరీక్షల ద్వారా ముందస్తుగా క్షయవ్యాధి నివారణ జరుగుతుందని, ఈ పరీక్షల్లో ఎవరికైనా పాజిటివ్ వస్తే ఉచితంగా మూడు నెలల పాటు టీబీ ప్రివెంటివ్ థెరపీ మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నిషియన్ మహ్మద్ అజ్జు, టీబీ పర్యవేక్షకులు సూపర్‌వైజర్ శశికుమార్, హేమలత, అశోక్, గంగాధర్, ఆశ కార్యకర్తలు మంజుల, హిమబిందు, లత వైద్య సిబ్బంది ఉన్నారు.

### నీటి సంపులో పడి చిన్నారి మృతి

వేములవాడ రూరల్, మే 15: వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్‌లో ఓ వివాహానికి హాజరైన కుటుంబంలో విషాధం నింపింది. హైదరాబాద్‌కు చెందిన ముస్లిం కుటుంబం తిప్పాపూర్‌లో వివాహానికి రాగా జిక్ర ఫాతిమా (3) అడుకుంటూ ఇంటి సమీపంలోని నీటి సంపులో పడింది. చాలా సేపు తర్వాత కుటుంబసభ్యులు గమనించగా, నీటి సంపులో ఉన్న చిన్నారిని దవాఖానకు తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మూడేళ్ల చిన్నారి కావడంతో ప్రమాదవశాత్తు జరిగిందని పోస్ట్‌మార్టం చేయొద్దని తల్లిదండ్రులు వేడుకున్నారు. పోలీసులను వివరణ కోరగా చిన్నారి మృతి చెందిన్నట్లు తల్లిదండ్రులు దరఖాస్తు ఇచ్చిన్నట్లు తెలిపారు.

### శ్రీరామ సొసైటీ చైర్మన్‌గా రాంప్రసాద్



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

కోనరావుపేట, మే 15 : మండలంలోని మామిడిపల్లిలో శ్రీరామ రైతు పరస్పర సహకార సంఘం చైర్మన్‌గా కోల రాంప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం సొసైటీ అధ్వర్యంలో రైతులంతా సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్ కలెట్ల ఎల్లయ్య, కోశాధికారిగా సాసాల రాజరాం, సెక్రటరీగా గుండేకార్ల రాజు, డైరెక్టర్లుగా దావేర దేవయ్య, బదుగు అంజయ్య, వెంకటేశ్, కొడుక రాజు, లడే నర్సింగం, గుమ్మడి అంజయ్య ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. చైర్మన్ రాంప్రసాద్‌కు మాజీ చైర్మన్ కొడుక రమేశ్ శాలువాతో సన్మానించారు.

### హన్మాజీపేట పీహెచ్‌సీ తనిఖీ

వేములవాడ రూరల్, మే 15: మండలంలోని హన్మాజీపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కాయాకల్ప అసెస్మెంట్ జిల్లా టీంతో కలిసి జిల్లా వైద్యాధికారి రజిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆరోగ్య కేంద్రంలో నాణ్యతతో కూడిన సదుపాయాలు వైద్య సహాయం పొందే వ్యాధిగ్రస్తులకు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో ఆరోగ్య కేంద్రంను తనిఖీ చేసినట్లు తెలిపారు. దవాఖాన పరిసరాలతో పాటు దవాఖాన లోపల పరిశుభ్రంతో పాటు, వ్యాధిగ్రస్తులకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి తాగునీరు, బాత్రూం, విద్యుత్ సౌకర్యం, బిల్డింగ్ నాణ్యతను క్వాలిటీ సిబ్బందితో తనిఖీ చేసినట్లు తెలిపారు. క్వాలిటీ టీం ఎన్‌హెచ్ ఎండీపీవో రాజేందర్, క్వాలిటీ మేనేజర్ సింధూజ, వైద్యధికారులు ఉన్నారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బోయినపల్లిరూరల్, మే15: మండలంలోని కోరెం గ్రామశివారులో కొండపోచమ్మ ఆలయ ప్రాంతంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ట్రైనీ ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. అక్కడ పెట్రోలింగ్ విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని డ్రైవర్ మొగిలి వెంకటేశ్‌తో సహా ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు.